

# ఆంధ్రక్రైస్తవ కీర్తనలు

సహో॥ జేమ్స్ జయశీల్ చౌధరి

తెలుగునాట సాంప్రదాయ క్రైస్తవ సంఘములలో - వారి సంఘారాధనలలోను, యితర సందర్భాలలోను ఆంధ్రక్రైస్తవ కీర్తనలు పాడుట కద్దు. ఈ కీర్తనల నేపథ్యము నేటి తెలుగు క్రైస్తవులకు చాలా మందికి తెలియదు. ఆంధ్రక్రైస్తవ కీర్తనలు పుస్తకము వారి యింట్లలో వున్నా - కీర్తనల పట్టిక, కీర్తనాకారుల పేర్లు చూడరు.

మన యీ కీర్తనలు కర్ణాటక సంగీత బాణిలో వుంటాయి. కర్ణ = చెవి, అటకము = శుభకరము. అనగా చెవికి ఇంపుగా వుండే సంగీతము.

పురుషోత్తము చౌధరి (1803-90) విలియం డాసన్ (1816-75) పులిపాక జగన్నాథము (1826-96) క్రీస్తు భక్తి కీర్తనలు రచించిన తెలుగు క్రైస్తవ కవి / వాగ్గేయకారత్రయం. వీరు ముగ్గురు రెండు వందలకు పైగా కీర్తనలు రచించారు. వీరు చూపిన బాటలోనే తరువాతి క్రైస్తవ కవులు 1950 సం॥ వరకూ రాగ, తాళాలతో కీర్తనలు రచించారు. వాగ్గేయకారులు - తాము రచించిన కీర్తనలకు సంగీతము కూర్చి పాడి వినిపించేవారు.

తెలుగుభాషలో క్రైస్తవ కీర్తనలు రాకముందు, ఆంగ్లేయ మిషనరీలే ఆంగ్లకీర్తనలు తెలుగులోకి అనువదించి, ఆ కీర్తనలను సంఘారాధనలో పాడేవారు. 1840-52 సంవత్సరములలో - విలియం డాసన్, జాన్ హే, విలియం బెర్రి, పురుషోత్తము చౌధరి, జొసయాబర్డర్, పులిపాక జగన్నాథముమున్నగు వారు శ్రీకాకుళంలో పనిచేసారు. 1846 సం॥లో శ్రీకాకుళంలో లండన్ మిషన్ చర్చి భవనం నిర్మించారు. ఆలయ ప్రతిష్ఠ నిమిత్తము, పురుషోత్తము చౌధరి "యెహోవా నీ మహిమాస్తవము" అనే కీర్తన రచించారు. విలియం డాసన్ గారు భారతీయ సాంప్రదాయ దుస్తులు ధరించి, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని, చేతిలో చిడతలు పట్టుకొని, నృత్యము చేస్తూ, కీర్తన పాడుతూ బలగవీధిలో వారుండిన బంగళా నుండి చర్చివరకూ పూరేగింపుగా వెళ్ళి, గుడి చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ చేసి ఆలయప్రతిష్ఠగావించారు.

ఆ రోజుల్లో డాసన్‌గారు ఒక వివాహానికి వెళ్లారు. అప్పటికి వివాహ సంబంధ కీర్తన ఏదీ లేదు. కీర్తన పాడకుండానే వివాహ కార్యక్రమము ముగిసింది. ఇది ఒక పెద్దలోటుగా ఆయనకు అనిపించింది. అదే రోజు రాత్రి ఆయన "కోరికొనియున్నాము. యేసు ప్రభూ కోరికొనియున్నాము" అనే వివాహ గీతము రచించారు. ఈలాంటి

అనుభవములు ఆయనకున్నందున, సంఘారాధనలలోను, సభలలోను, విశేష సందర్భాలలోను పాడుటకు కీర్తనలుండాలని భావించారు. క్రైస్తవులందరికీ అందుబాటులో కీర్తనల పుస్తకము వుండాలనే ఆలోచన కలిగింది. అప్పటికే పురుషోత్తం చౌధరి, జాన్ హే, విలియం బెర్రి, మున్నగువారు రచించిన కీర్తనలున్నాయి. తాను కూడా రచించిన కీర్తనలున్నాయి. ఈ కీర్తనలన్నీ సంకలనము చేసి 1846 సం॥లో "దాసన్ పురుషోత్తం" కీర్తనల పుస్తకము ముద్రింపబడింది. ఇదే నేటి మన 'ఆంధ్ర క్రైస్తవ కీర్తనల" పుస్తకమునకు పునాది. అటు తరువాత, మరికొన్ని కీర్తనలు చేర్చి రెండవ ముద్రణ జరిగింది. మూడో ముద్రణ 1866 సం॥లో జరిగింది. ఇందులో పురుషోత్తము చౌధరి కీర్తనలు 78 వున్నాయి. విలియం డాసన్, పులిపాక జగన్నాధం కీర్తనలు, వేరే కవుల కీర్తనలు ఇందులో వున్నాయి. ఈ పుస్తకములు నేడలభ్యము.

విలియం డాసన్‌గారు మరణించాక మరికొన్ని ముద్రణలు జరిగాయి. 1883 సం॥లో ముద్రింపబడిన పుస్తకములో 258 కీర్తనలున్నాయి. ఇందులో కడప క్రైస్తవులు రచించిన 100 కీర్తనలున్నాయి. ఈ పుస్తకము కాపీ ఒకటి బ్రిటిష్ లైబ్రరీ, లండన్‌లో వున్నది. (ఈ పుస్తకము జెరాక్స్ కాపీ 2004 సం॥లో నేను తెప్పించుకుంటిని)

1869 సంవత్సరములో ముద్రింపబడి ఆడయార్ థియోసఫికల్ లైబ్రరీలో ఒక పుస్తమున్నది. అది మనకు అందుబాటులో లేదు. రెవ బి.డి.పి.రావు (రాజమండ్రి) గారు దీనికొరకై చాలా ప్రయత్నము చేసిననూ, లైబ్రరీ వారు దాన్ని చూచుటకు కూడా యివ్వలేదు.

1893 సం॥లో 'తెలుగు కీర్తనలు" పేరుతో రెవ.డబ్ల్యు. స్టీఫెన్‌సన్‌గారి సంపాదకత్వములో 275 కీర్తనలున్న పుస్తకము, ది రెలిజియస్ ట్రాక్ట్ అండ్ బుక్ సొసైటీవారిచే ముద్రింపబడింది. దీని ఐదవ ముద్రణ 1909 సం॥లో 5000 ప్రతులతో వచ్చింది. ఇందులో పురుషోత్తము చౌధరి కీర్తనలు 79, పులిపాక జగన్నాధము కీర్తనలు 41, విలియమ్ డాసన్ మరియు ఆయనతో ఇతరులు కలిసి వ్రాసిన కీర్తనలు - 46 వున్నాయి.

1936 సం॥లో మద్రాసులోని "కైస్తవ విద్యాభివర్ధినీ సమాజము" వారి ఆధ్వర్యములో పది వేర్వేరు సంఘ ప్రతినిధులు పాల్గొని, అన్ని సంఘములకు అనుగుణముగా వుండేటట్లు "ఆంధ్ర క్రైస్తవ కీర్తనలు" పుస్తకము రూపొందించారు. క్రిస్టియన్ లిటరేచరు సొసైటి, మద్రాసువారు 1937లో దీనిని ముద్రణ గావించారు. దీని ఐదవ ముద్రణ 1948సం॥లో జరిగింది. ఇందులో 350 కీర్తనలు, 97 సంగీతములున్నాయి. పుస్తకము అట్టపై సిలువ బొమ్మ వుంది. ఈ పుస్తకము చాలా కాలము వాడుకలో వుంది.

విలియం డాసన్ బ్రతికివుండగా కవులు రచించిన కీర్తనలు ఎటువంటి మార్పు చేయకుండా, యధాతధముగా ముద్రించారు. అటు తరువాత ముద్రించిన పుస్తకములలో కవులు బ్రతికి యుండగానే వారి అనుమతి లేకుండా, వారి కీర్తనలు సవరించి / మార్పులు చేసి ముద్రించారు. ఇది సాంప్రదాయ విరుద్ధము. కవుల యెడల జరిగిన మహాపరాధము.

1966 సం॥లో ఎంపిక చేసిన కీర్తనలు అంశములవారిగా విభజింపబడి ఇప్పటికి సుమారుగా 20 ముద్రణలు గావింపబడినాయి.

1950 దశకంలో సినీనేపథ్య గాయనిలు గానము చేసిన ఆంధ్ర క్రైస్తవ కీర్తనలు గ్రామఫోను రికార్డులుగా వెలువబడ్డాయి.

సువార్తవాణి, విజయవాడ వారు రేడియో ద్వారా చాలా కీర్తనలు ప్రసారము చేశారు. ఇవి కాసెట్సుగా విడుదల చేశారు. కొందరి వద్ద కొన్ని కేసెట్సు వున్నాయి. టేపురికార్డులు ప్రస్తుతము వాడుకలో లేక ఇవి మరుగున పడ్డాయి.

నేడు మన సంఘములలో కూడా, ఆరాధనలలో 100కి మించి కీర్తనలు పాడుట లేదు. కారణము వాటి రాగములు, తాళములు తెలియక పోవడము. 1950 దశకములో ప్రతీ సంఘములలో ఈ కీర్తనలన్నీ పాడగలిగేవారు. అయితే తరములు మారుతున్నకొద్దీ కొత్తపాటలకు ప్రాధాన్యతనిచ్చి ఆంధ్రక్రైస్తవ కీర్తనలను నిర్లక్ష్యము చేయుచున్నారు. ఈ కొత్త కీర్తనలు "పుబ్బలో పుట్టి, మఖలో మాడిపోయే" చందంగా వున్నాయి. రెవ. బి.డి.పి.రావు (రాజమండ్రి) గారు 16000 తెలుగు కీర్తనలు / పాటలు సేకరించి యున్నారు. వారి కృషి శ్లాఘనీయం. ఇందులో ఐదుశాతం పాటలు కూడా ఎవరూ పాడుట లేదు. సందర్భానుసారము, సభలలో కొత్త పాటలు పాడుచున్నారు. సభలైపోయాక అవి మరచిపోతున్నారు. రాశికన్న వాసిమిన్న గదా! శబ్దం కన్నా అర్థమే గొప్పకదా!


సంఘ కాపరులు, సంఘపెద్దలు ఈ విషయము తీవ్రముగా ఆలోచించి "ఆంధ్రక్రైస్తవ కీర్తనలు" పునరుజ్జీవింపచేయాలి. సంఘ కోయర్‌లోనున్న యువజనులను ప్రోత్సహించి ఇవి పాడేటట్లు చేయాలి. ఎ.సి.టి.సి. హైదరాబాదు రామాయపట్నం మరియు జగన్నాయకపురం (కాకినాడ) సెమినెరీలవారు వారి విద్యార్థులకు ఈ కీర్తనలపై సమగ్ర అవగాహన కలిగించాలి.

ఆంధ్రక్రైస్తవ కీర్తనలు మనపితరులు మనకిచ్చిన వారసత్వము. ఈ కీర్తనలలోని సంగీత సాహిత్యాలు వారి శ్రమానుభవము, పరిశుద్ధవాక్యము, గంభీర భావములతో కూడికొనియున్నవి. రెవ. ఆర్.ఆర్. సుందరరావు గారు తన "తెలుగులో క్రైస్తవ సాహిత్యం"లో ఈ కీర్తనలపై చాలా గొప్పగా సాహిత్య సమీక్ష చేశారు. ప్రతి క్రైస్తవుడు

దీన్ని చదవాలి. ఇది ఇంతవరకూ ఒకే ముద్రణ 1976లో గావింపబడింది. పెద్దలు పూనుకొని దీన్ని పునర్ముద్రణ గావించాలి. శ్రీమతి నిట్టల సుధారత్నాంజలి (అమెరికా) ఆంధ్ర క్రైస్తవ కీర్తనలపై రీసెర్చి చేసి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుండి డాక్టరేటు పట్టా పుచ్చుకొన్నారు. ఆమె థీసిస్ "తెలుగులో క్రైస్తవ సంకీర్తనలు - పరిశీలన" పేరుతో పుస్తకముగా వెలువడింది. కొంతమంది క్రైస్తవ విద్యార్థులు మన కీర్తనలపై పరిశోధన చేసి ఎమ్.ఫిల్ డిగ్రీలు పొందుచున్నారు.

ఆంధ్రక్రైస్తవ కీర్తలనుగురించి చాలా మంది క్రైస్తవుల వద్ద చాలా సమాచారము వుండే వుంటుంది. వారు ఆ సమాచారము అందరితో పంచుకుంటే చాలా బాగుంటుంది. మరియు దేవునికి మహిమకరముగా వుంటుంది.

విజయనగరంలో నున్న ఒక ప్రైవేటు సంగీత కళాశాల వారి సహకారముతో 200 పైగా కీర్తనలు నేను రికార్డ్ చేయించినాను. తరుచుగా పాడని పాటలు ఎంపికచేసి వాటిని పాడించడం అయినది. ఈ కీర్తనలలో చాలా వాటిని సంగీత కచేరి రూపములో డి.వి.డిలుగా రికార్డు చేయడమైనది. ఇంతవరకూ 141 కీర్తనలు 7 డి.వి.డి.లలో రిలీజు చేయడమైనది. మిగతా కీర్తనలను త్వరలోనే రిలీజు చేయగలను. వీటి ముఖ్యోద్దేశము కీర్తనలు ఎలాగు పాడుకోగలమన్నదే. దేవుని చిత్తమైతే మిగిలిన 150 కీర్తనలు కూడా భవిష్యత్తులో రికార్డ్ చేయాలని తలంచుచున్నాను.



# విలియం డాసన్ (1816-75)

సహో జేమ్స్ జయశీల్ చౌధరి

నేడు మనం సంఘారాధనలో పుపయోగిస్తున్న "ఆంధ్ర క్రైస్తవ కీర్తనలు" పుస్తకమునకు పునాది వేసిన వాడు వాగ్గేయకారుడైన "విలియం డాసన్" ఈతడు మన దేశములోనే జన్మించిన ఆంగ్లేయుడు.

లండన్ మిషన్ సొసైటి మిషనరీ జేమ్సు డాసన్ మాన్సియర్ టెల్లిరాండ్ దంపతులకు తొలిచూలు సంతానంగా, విశాఖపట్నంలో తేది 16 జనవరి 1816న విలియం జన్మించారు. రెండవ కుమారుడు జన్మించాక కొన్ని సంవత్సరముల తేడాతో దంపతులిర్వురూ చనిపోగా 1832 సం॥ సరికి పిల్లలిద్దరూ అనాథలైయ్యారు. వీరి సంరక్షణ భారము మేజర్ బ్రెట్ తీసుకున్నాడు. కొద్ది సంవత్సరముల తర్వాత తమ్ముడు ఇంగ్లండ్‌కి తరలిపోగా, విలియం మాత్రము మేజర్ బ్రెట్ దగ్గరే వుండిపోయాడు. మేజర్ బ్రెట్‌కి బదిలీ కాగా ఆయనతో కూడా మద్రాసు వెళ్ళి, అక్కడ రెవ॥ జె.స్మిత్ వద్ద క్రైస్తవ వేదాంత విద్యనభ్యసించాడు. ఆసమయంలోనే తెలుగు, తమిళం, హిందీ భాషలలో ప్రావీణ్యత సంపాదించాడు.


తన 22వ యేట, కడపలో అసిస్టెంట్ మిషనరీగా విలియం నియమింపబడినాడు. తనకంటే ఒక సంవత్సరము చిన్నదైన కరోలిన్ సోఫియా వాన్‌ను వివాహము చేసుకొన్నాడు. 1840 సం॥లో మిషనరీగా పదోన్నతి పొంది శ్రీకాకుళంలో నియమింపబడినాడు. 1843సం॥లో విశాఖపట్నంలో అభిషేకము పొందాడు. 1852వ సం॥లో విజయనగరమునకు మిషనరీగా బదిలీ అయ్యాడు. 1859 సం॥ ప్రారంభములో తిరిగి విజయనగరమునకు చేరుకున్నాడు. విజయనగరంలో మిషనరీగా రెండు దశాబ్ధలు తన సేవలందిచాడు. అనారోగ్య కారణాన 1871-73 సంవత్సరాలలో నీలగిరీస్, కోయంబత్తూర్, మద్రాసులలో విశ్రాంతి తీసుకొని తిరిగి విజయనగరం చేరుకున్నాడు. భార్య ప్రోద్భలంతో, ఇంగ్లాండు వెళ్ళి, ఆరోగ్యము పొంది తిరిగి భారతదేశము వచ్చి సువార్త కొనసాగించాలనే కోరికతో 1875 సం॥లో ఓడలో భార్యా సమేతముగా పయనమయ్యాడు. ఓడ ప్రయాణంలో తన ఆరోగ్యము మరింత క్షీణించగా తేది 5 మే 1875 సం॥లో విలియం డాసన్ ప్రభువు నందు నిద్రించాడు. ఓడలోని ప్రయాణికులు, సిబ్బంది, మత గురువులు, డాసన్ జీవిత విశేషాలు తెలుసుకొని చలించిపోయారు.

కన్నీటితో ఆయన పార్థీవ దేహాన్ని జల సమాధి చేశారు. భార్య ఇంగ్లాండు చేరుకొని అక్కడే వుండిపోయింది. రిచ్‌మండ్‌లో తేది 10 డిసెంబర్ 1889 సం॥న మృతి చెందింది. నీతి మంతులను జ్ఞాపకము చేసికొనుట ఆశీర్వాదకరము. నీతిమంతుల మరణము యెహోవా దృష్టికి విలువైనది. విలియం డాసన్ శ్రీకాకుళంలో వుంటుండగానే, తానే ఆహ్వానించగా, 1845 సం॥లో ఒరియా ప్రాంతము నుండి పురుషోత్తము చౌధరి అక్కడకు చేరుకున్నాడు. వీరిరువురూ సువార్త సేవ, క్రైస్తవ సాహిత్య సేవ కలిసి చేశారు. ఇరువురూ వాగ్గేయకారులే!

ఆ రోజుల్లో విలియం డాసన్ ఒక వివాహానికి వెళ్ళి, వివాహ గీతము లేకుండానే కార్యక్రమము ముగించుట చూచి ఆలోచనలో పడ్డాడు. ఆ రోజు రాత్రే "కోరి కొనియున్నాము, యేసుప్రభూ కోరికొనియున్నాము" అనే వివాహ కీర్తన రచించాడు. సంఘారాధనలోను, ప్రత్యేక సందర్భములలోను పాడుకొనుటకు, క్రైస్తవులకు ఒక కీర్తనల పుస్తకం వుండాలని కోరుకున్నాడు. అప్పటికీ తాను, పురుషోత్తము చౌధరి, జాన్ హే, విలియం బెర్రి వ్రాసిన కీర్తనలు అందుబాటులో వున్నాయి. అవన్నీ కూర్చి "డాసన్ - పురుషోత్తము" కీర్తనల పుస్తకము 1846 సం॥లో అచ్చువేయించాడు. వేరేవారు వ్రాసిన కీర్తనలు కలిపి ఈ పుస్తకము రెండవ ముద్రణ జరిగింది. ఎప్పుడో తెలియదు. తృతీయ ముద్రణ 1866 సం॥లో జరిగింది. ఇందులో పులిపాక జగన్నాథము గారి కీర్తనలు చేర్చబడినవి.

విలియం డాసన్ చాలా కీర్తనలు రచించగా కొన్ని మాత్రమే మనకు అందుబాటులో వున్నాయి. 1893 సం॥ రెవ॥ డబ్ల్యూ.డబ్ల్యూ. స్టీఫెన్‌సన్ గారి సంపాదకత్వములో వెలువడిన కీర్తనల పుస్తకము ఐదవ ముద్రణ 1909 సం॥లో జరిగింది. ఇందులో విలియం డాసన్ మరియు ఇతరులు వ్రాసిన ఆంధ్రక్రైస్తవ కీర్తనల పుస్తకంలో డాసన్ గారి కీర్తనలు 14 వున్నాయి. ఒక్కొక్క కీర్తన ఒక్కో ఆణిముత్యం. ఉత్కృష్టమైన భాష, భావము, భక్తి మెండుగా కలిగివున్న కీర్తనలివి. సాహిత్యపిపాసగల ప్రతి తెలుగు క్రైస్తవుడు ఈ వాగ్గేయకారుని గురించి తెలుసుకోవాలి. ఆయన కీర్తనలు గానము చేస్తూ దేవుని స్తుతించాలి. డాసన్ గారు పూనుకోక పోయివుంటే "ఆంధ్ర క్రైస్తవ కీర్తనలు" అనే నిధి మనకు దక్కియుండేది కాదు. అలాగున విలియం డాసన్ గారు, ఒరియా ప్రాంతము నుండి పురుషోత్తము చౌధరిని శ్రీకాకుళం రప్పించి, ఆదరించి, ప్రోత్సహించి, తెలుగులో క్రైస్తవ సాహిత్యాన్ని పరిపుష్టము గావించాడు. ఈ సంగతి ఇంకోసారి వివరించగలను.

✝



# ఆంధ్రక్రైస్తవ కవిసార్వభౌముడు రెవ.పురుషోత్తం చౌధరి

సహో॥ జేమ్స్ జయశీల్ చౌధరి

పురుషోత్తం చౌధరి పూర్వీకులు 18వ శతాబ్దారంభములో, వంగదేశము మిధునపుర ప్రాంతము నుండి కళింగదేశ ప్రాంతము అనగా నేటి దక్షిణ ఒరిస్సా -ఉత్తరాంధ్ర జిల్లాలకు వలస వచ్చారు. జమీందారుల వద్ద శిస్తు వసూలుజేసే అధికారులుగాను, పండిత-ఉపాధ్యాయులుగాను, ఉద్యోగులుగాను కుదురుకున్నారు. వీరు గౌడ బ్రాహ్మణులు, వైష్ణవ మతావలంబికులు, భరద్వాజ గోత్రికులు. చౌధరి అనునది ఉద్యోగరీత్యా వీరికి సంక్రమించిన బిరుదు. నాలుగు పరగణాలకు లేక ఇలాకాలకు లేక నాలుగు గ్రామాలకు శిస్తు వసూలు చేసే అధికారులు గనుక వీరిని చతుర్ధరీ లేక చౌధరి అని సంబోధించేవారు. అదే వారి ఇంటిపేరయ్యింది. ఉత్తరాదిన పేరు వెనుక ఇంటిపేరుంటుంది. ఈలాగు వలస వచ్చిన వారిలో కొందరు తెంబూరు ముఠాగ్రామమైన మదనాపురములో నివాసమేర్పరచుకున్నారు. మిరాసీదారు కూర్మనాథ్ చౌధరి - సుభద్రా దేవి దంపతులకు ఇరువురు కుమార్లు, పెద్దవాడు జగన్నాధు, చిన్నవాడు పురుషోత్తము. పురుషోత్తముడు 1803 సం॥ సెప్టెంబరు 5వ తేదీన జన్మించాడు. తన ఏడవ ఏట ఉపనయనం జరిగింది. తనకు 15సం॥లు నిండేనాటికి ఆనాటి చదువు పూర్తిచేసుకున్నాడు. ఏకసంథగ్రాహి. తెలుగు, ఒరియా, సంస్కృత భాషలలో ప్రావీణ్యత సంపాదించాడు. రాత్రిళ్ళు రామాయణ మహాభారతాలు, భాగవత పురాణాలు పఠించి గ్రామప్రజలకు వినిపిస్తూ స్వల్ప ఆదాయము పొందేవాడు. తన భుజములపై శంఖుచక్రములు పచ్చపొడిపించుకున్నాడు. యవ్వనము వచ్చేటప్పటికే పసిమిఛాయతో నిండైన విగ్రహంతో ఆజానుబాహుడుగా వుండేవాడు.

పురుషోత్తముడు తన 20వ యేట, మేనమామ రఘునాథ్ పాల్ మహంతి కుమార్తె 9 ఏళ్ళ రాధామణిని వివాహమాడాడు. తన వివాహము జరిగిన కొన్ని మాసములకే తండ్రి కూర్మనాథ్ చౌధరి మరణించాడు. తండ్రి మరణము తనపై బలమైన ప్రభావము చూపగా వైరాగ్యము జెంది, తాత్వికతపై మనసు పెట్టాడు. పాపచింతన మోక్షసాధనకై హిందూ మతగ్రంధాలు సూచించిన కర్మకాండలు ఆచరిస్తూ

మత నిష్టాపరుడై వుండేవాడు. తన మోక్ష సాధనకు గురువుల ప్రేరేపణతో చేయరాని కార్యములు చేశాడు. అవధూతలతోను, అఘోరిలతోను సాంగత్యము జేశాడు. నిర్జన ప్రదేశాలలో సంచరించాడు. కాశీకి పోవాలని ప్రయత్నం చేశాడు గాని కుదరలేదు. అన్న జగన్నాధుడు వారసత్వముగా అబ్బిన కరణీకము చేస్తూ కుటుంబభారము వహించాడు. తమ్ముని వరస గమనించి పర్లాకిమిడిలో ఒక బడిని నెలకొల్పి పురుషోత్తమునకు దాని బాధ్యతలు అప్పగించాడు. దినములు ఈలాగున గడుస్తుండగా 1825 సం॥లో ఒకనాడు అన్న జగన్నాధుడు తనకు సంతలో ఇచ్చిన ఒక కరపత్రము తెచ్చి తమ్ముడికిచ్చాడు. ఈ కరపత్రము రూపొందించినది విలియం కేరి మరియు ఆయన మిత్రులు. సిరంపూర్‌లో ముద్రించబడింది. కరపత్రములో వున్న సారాంశము "దేవుడొక్కడే, దేవతలు మానవకల్పితాలు, దేవుని కుమారుడు యేసుక్రీస్తు నరావతారియై మానవుల పాపములకు ప్రాయశ్చిత్తముగా సిలువపై మరణించి వారికి మోక్షమను గ్రహించాడు". కరపత్రము చదివిన పురుషోత్తమునకు ఏమీ బోధపడలేదు. తాను చదివిన హిందూగ్రంథాలలో ఈలాంటి విషయము లేదు. ఏమిటోలే అని ఆ కర పత్రమును పుస్తకాల పెట్టిలో అడుగున పడవేశాడు.

1832సం॥ పురుషోత్తము – రాధామణి దంపతులకు కుమార్తె జన్మించింది. పేరు శాంతికుమారి. అదే సంవత్సరము ఒక బ్రిటీష్ అధికారి మదనాపుర ప్రాంతములో సర్వేపనిమీద వచ్చాడు. తెల్లగా నున్న ఆ ఆంగ్లేయుడు పురుషోత్తమునకు ఒక దేవదూతలా కనిపించాడు. వెంటనే అన్నగారు తనకిచ్చిన కరపత్రము గుర్తుకువచ్చి పెట్టె అడుగునుండి దాన్ని తీసి మరల మరల చదివాడు. విషయము కొద్దిగా అర్థమై తన మోక్షాన్వేషణకు అనుకూలముగా వున్నట్లు గ్రహించాడు. స్నేహితుల ద్వారా మరి మూడు వేరే కర పత్రములు సంపాదించి చదివాడు, జిజ్ఞాస మొదలైంది. బరంపురములో నున్న క్రైస్తవ మతప్రచారకుల ద్వారా మరికొన్ని విషయాలు తెలుసుకోవాలన్న తన ప్రయత్నం నెరవేరలేదు. అప్పుడు కాలినడకన 80 మైళ్ళ దూరములో నున్న విశాఖపట్నం వెళ్ళి లండన్ మిషన్ సొసైటీకి చెందిన మిషనెరీలను కలసి మరింత సమాచారము తెలుసుకోవాలనుకున్నాడు. కాని అప్పటికి అక్కడ ఉన్న మిషనెరీలు మరణించారు. వారి స్థానములో ఇంకెవరూ రాలేదు. ఎవరో తనకు రోమన్ కేథలిక్ చర్చిని చూపెట్టారు. చర్చిలో ఉన్న విగ్రహాలు చూసి, నచ్చక వెనుతిరిగాడు. ఇంకా తెలుసుకోవలెనని తపన పెరిగిందే కాని తరగలేదు.

1833సం॥ ఏప్రిల్ నెలలో అన్నగారి బదులు పురుషోత్తముడు శ్రీకాకుళం కోర్టు పనిమీద వెళ్ళి, ఆ పని ముగించుకున్నాక, క్రైస్తవ మతబోధకుల గురించి వాకబు చేసి హెలెన్ నాట్ దొరసాని యొద్దకు వెళ్ళాడు. ఆమె పురుషోత్తమును ఆదరించి మరికొన్ని పత్రికలు, "మోక్షమార్గము" "లూకా సువార్త" ఇచ్చి ప్రోత్సాహపరిచింది.

అడ్జుటెంట్ ఎవిలిన్ దొరను పరిచయం చేసింది. ఆయన కూడా పురుషోత్తముని ప్రోత్సాహపరిచాడు. తాను క్రైస్తవుడగుటకు సంసిద్ధను తెలియజేయగా, ఎవిలిన్ దొరగారు సందేహించి, పురుషోత్తముని ద్వారానే అన్న జగన్నాధ చౌధరికి ఉత్తరము ద్వారా తెలియజేయించారు. అన్న జగన్నాధుడు, బావ రామక్రిష్ణ పట్నాయిక్, ఇతర బంధువులు హుటాహుటిన శ్రీకాకుళం వచ్చి పురుషోత్తముని మదనాపురము తీసుకొనిపోయారు. 1833సం॥ మే నెలలో పురుషోత్తముడు భార్యను, చిన్నదైన కుమార్తెను వెంటదీసుకొని శ్రీకాకుళం వెళ్ళగా హెలెన్ నాట్ దొరసాని వారినాదరించింది. అక్కడ రెండు మూడు రోజులుండగా భార్య రాధామణికి ఈ మత సంబంధమైన విషయాలు నచ్చక సతమత మవసాగింది. కొన్ని రోజుల తర్వాత రాధామణి తల్లి మరియు ఆమె అన్న శ్రీకాకుళం వచ్చారు. వారిని చూసిన రాధామణి సంబరపడుతూ వారితో తిరిగి మదనాపురము వెళ్ళిపోయింది.

ఎవిలిన్ దొర, హెలెన్‌నాట్ దొరసాని సలహాపై పురుషోత్తముడు విశాఖపట్నం వెళ్ళి మేజర్ బ్రెట్ దొరగార్ని కలిసాడు. నూతన నిబంధన (1829సం॥లో చెన్నపట్నంలో ముద్రింపబడినది) చదివి రక్షణ యేసుక్రీస్తు ద్వారానే దొరుకుతుంది అని విశ్వసించాడు. క్రైస్తవుడవగోరి తన జంధ్యాన్ని 1833సం॥ జూన్ 10వ తేదీన తీసివేసి మేజర్ బ్రెట్ దొరగారి చేతిలో పెట్టాడు. జూలై నెలలో 300 మైళ్ళు కాలినడకన రెండు వారములలో కటకపూరి చేరుకున్నాడు. బాప్టిస్టు మిషనెరీ అయిన రెవ.చార్లెస్ లేసీ గారిని కలసి అక్కడున్న కొద్దిమంది క్రైస్తవులతో కొన్ని వారములు సహవాసము చేశాడు. సర్క్యూట్ జడ్జిగారి అనుమతితో, అక్టోబరు 6వ తేదీన గంగా మందిరమను పెద్ద కోనేటిలో వేయి మంది ప్రజలు చూస్తుండగా రెవ.చార్లెస్ లేసీ గారు పురుషోత్తమునకు బాప్తీస్మ మిచ్చారు. అదేరోజు ప్రభు భోజనసంస్కారములో పాల్గొన్నారు. తన యీ అనుభవమును "మా యేసుక్రీస్తుని మఱుగు గల్గెనురా, నా యాత్మ ఘనరక్షణ నగము కెక్కెనురా" కీర్తనలో వెల్లడించారు. ఇదే తెలుగు బాషలో వ్రాయబడిన మొట్టమొదటి క్రైస్తవ కీర్తన.

మరికొన్ని రోజులు కటకపురిలో గడిపాక 20రోజులు ప్రయాణము చేసి నవంబరు నెలలో విశాఖపట్నం చేరుకున్నారు. విశాఖపట్నం వీధులలో, సింహాచలం, ఇతర గ్రామాలలో యేసుక్రీస్తుని గురించి ప్రకటించసాగారు. సువార్తను వ్యతిరేకించే ప్రజలు పురుషోత్తమున్ని బూతులు తిడ్తూ, అపహాస్యం చేస్తూ, ఆయనిచ్చిన కరపత్రము చించి తలమీద పోస్తూ కొన్నిసార్లు కొడుతూ, మెడపట్టి గెంటివేస్తూండేవారు. కొందరు ఆకతాయిలు కంకరరాళ్ళు ఈయనపై విసిరేవారు. కొన్నిరోజులు గడిచాక 1834సం॥ ఆరంభములో మేజర్ బ్రెట్ దొరగారితో కలసి చెన్నపట్నం వెళ్ళారు. చెన్నపట్నంలో

కూడా సువార్త ప్రకటించుచుండగా పై విధముగానే సువార్త వ్యతిరేకులు పురుషోత్తము గారిని హింసించారు. ఒకసారైతే ఈయన్ని చంపివేయుటకు ప్రయత్నము చేయగా, ఇద్దరు క్రైస్తవ యువకులు కలుగజేసుకొని, వారినుండి విడిపించి పరుసవాకంలో నున్న మేజర్ బ్రెట్ గారింటికి చేర్చారు. లండన్ మిషన్ సొసైటీకి చెందిన ఒక మిషనెరీ బళ్ళారి నుండి చెన్నపట్నంలో నున్న మేజర్ బ్రెట్ గారి యొద్దకు వచ్చాడు. పురుషోత్తముని వృత్తాంతము తెలిసికొన్న ఆ మిషనెరీ, ఈయన్ని బళ్ళారి తీసుకొని వెళ్ళారు. అచ్చట పురుషోత్తముగారు సువార్త ప్రకటిస్తూ, మిషెరీ వారు నడుపుతున్న స్కూళ్ళు పర్యవేక్షించేవారు. మరియు బళ్ళారిలోనున్న ముద్రణాలయములో సువార్త కరపత్రములు ముద్రించుటకు సహాయపడేవారు. బహుశా బళ్ళారిలో నున్నప్పుడే "యేసు వంటి ప్రియబంధుడు మాకిక ఇహ పరములో లేడన్న" "పో పోవే యోలోకమా" "వినరే యోనరులారా వీనుల కింపుమీర" మున్నగు కీర్తనలు రచించారు. సువార్త కొరకై "కులాచార పరీక్ష" "ముక్తిమార్గ ప్రదర్శనము" పుస్తకాలు వ్రాసారు.

1834సం॥ చివరలో పురుషోత్తముడు బళ్ళారి మిషనెరీల నుండి సెలవు తీసుకొని స్వజనులకు సువార్త ప్రకటించుటకు స్వస్థలమైన మదనాపురమునకు ప్రయాణము చేసాడు. బళ్ళారి నుండి గుంతకల్లు, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, బందరు (మచిలీపట్నం), విజయవాడ, ఏలూరు, భద్రాచలం, రాజమండ్రి మీదుగా 1300 మైళ్ళు ప్రయాణము చేసి, దారిలో సువార్త ప్రకటించుచూ విశాఖపట్నం చేరుకున్నాడు. కేప్టెన్ రిచర్డ్సన్ గారికి అతిథిగా వుంటూ ఒకనాడు మదనాపురము బయలుదేరి వెళ్ళాడు. కుటుంబసభ్యుల, బంధువుల చీత్కార పుతార్కములు ఎదుర్కొన్నాడు. వాకిట్లో గోయితీసి, విస్తరి వేసి భోజనము పెట్టారు. తిన్నాక విస్తరి ఎత్తి పారేయించి, ఆపై పేడనీళ్ళ కళ్ళాపి చల్లారు. ఈ అవమానములు భరించి, మదనాపురములోనే ఒక గది అద్దెకు తీసుకొని చుట్టుప్రక్కలలో నున్న గ్రామాలలో సువార్త ప్రకటింపసాగాడు. ఈ సందర్భముగా "లోకము వారెల్ల లోకువ జూసిన లోపము నీకేమిటి" అనే కీర్తన వ్రాసాడు. కుటుంబసభ్యులలో ఎటువంటి మార్పు కన్పించలేదు. భార్య రాధామణి రహస్యముగా భర్తతో ఇప్పుడు మీ వెంట రాలేను. మరియొకసారి మీరు వచ్చాక మీతో కలసివస్తాను అని చెప్పింది. అంత పురుషోత్తముడు తిరిగి శ్రీకాకుళం వెళ్ళిపోయాడు. అచ్చట నుంటుండగా రెవ.గోర్డన్‌గారు పురుషోత్తముని విశాఖపట్నం రప్పించి, వారిరువురూ విశాఖపట్నం, చుట్టుప్రక్కల గ్రామములలో సువార్త ప్రకటింపసాగారు.

(మిగతా వచ్చే సంచికలో. . .)

(గత సంచిక తరువాయి....)

కొంతకాలము గడిచినాక, అన్నగారు జగన్నాధుడు 1835సం॥లో తన కుటుంబముతో సహా "ఆకులతంపర" గ్రామమునకు, మొఖాసదారుల యొద్ద మిరాసీదారుగా పనిచేయుటకు వెళ్లిపోయాడు. రాధామణి మదనాపురములో నున్న తల్లి, అన్నదమ్ములతో కలసి వుండేది. బహుశా ఈ సమయములోనే తల్లి సుభద్రాదేవి కాలధర్మము చెందింది. 1835సం॥ డిసెంబరు నెలలో పురుషోత్తముడు మరియొకసారి మదనాపురం వెళ్ళాడు. భార్యను, కుమార్తెను తన వెంట తీసుకొని వెళ్ళుటకు సన్నద్ధమైనాడు. భార్యకూడా భర్త వెంబడి వెళ్ళుటకు నిశ్చయించుకుంది. కాని ఆమె తల్లి, అన్నదమ్ములు, బంధువులు అడ్డుపడ్డారు. అయినా ఆమె నిర్ణయము ముందు వారి ఆటలు సాగలేదు. ఈ గొడవ జరుగుతుండగా పురుషోత్తముడు ఒక అరుగుపై కూర్చొని "రారో జనులారా, వేగము గూడి రారో ప్రియులారా" అనే సువార్త కీర్తన రచించి పాడాడు. భార్యను, కుమార్తెను వెంటబెట్టుకొని శ్రీకాకుళం వెళ్ళాడు. అచట నుండి కటకపురికి ప్రయాణమై వెళ్ళారు. 1836సం॥ ఏప్రిల్ నెలలో రాధామణి బాప్తీస్మము తీసుకొన్నది. ఒక కులీన యువతి క్రైస్తవ్యము స్వీకరించడము అచట నున్న ప్రజలలో, మిషనెరీలలో సంచలనము కలిగించినది. అటు తర్వాత పురుషోత్తముడు బోధకునిగాను, కేటకిష్టుగాను, అసిస్టెంటు మిషనెరీగాను పనిచేశాడు. పూరీ, బరంపురము, శ్రీకాకుళం, విశాఖపట్నం, చిట్టివలస ఆ చుట్టుప్రక్కల గ్రామాలలో సువార్త ప్రకటించాడు. కాకినాడ, రాజమండ్రి, తుని మున్నగు ప్రాంతాలలో సువార్త యాత్ర సాగించాడు. తన చివరి దినములలో కూడా ఒరిస్సాలోని బ్రాహ్మణి నది తీర గ్రామాలందు, బాలసోర్ వరకు వెళ్లి సువార్త ప్రకటించాడు.

అపో॥పౌలు వలె సువార్తయాత్రలు సాగించాడు. సుమారుగా 126 స్థలములలో ఆ చుట్టుప్రక్కల నున్న గ్రామాలలో సువార్త ప్రకటించాడు. కాలినడకన, ఎడ్ల బండిపై, గుర్రముపై సుమారుగా 4000 మైళ్ళు ప్రయాణము చేశాడు. దావీదు మహారాజువలె ఈయన 130పైగా కీర్తనలు రచించాడు. పద్య, గద్య రచనలతో తెలుగు క్రైస్తవ సాహిత్యానికి ఎనలేని సేవ చేశాడు. ఈయన వ్రాసిన రక్షణ చరిత్ర, నిస్తార రత్నాకరము, క్రైస్తవనీతి ప్రకాశము, పంచరత్నములు, యేసు నాయక శతకము, యేసుక్రీస్తు ప్రభోశతకము, సత్యవేదసార సంగ్రహము, విగ్రహ నిర్మాణము, కులాచార పరీక్ష, ముక్తిమార్గ ప్రదర్శనము, హిందూమత ప్రదర్శనము, సత్య భజన ప్రసిద్ధమైనవి. పురుషోత్తమునకు ఇద్దరు కుమార్లు, నలుగురు కుమార్తెలు. చిన్న కుమార్తె బహు చక్కనిది. యవ్వనారంభములోనే చనిపోయింది. చిన్నకుమారునకు జన్మనిచ్చాక రాధామణి 1851సం॥ సెప్టెంబరు నెలలో శ్రీకాకుళం నందు మరణించింది. తన పిల్లలు కటకపురిలో స్థిరపడగా, పురుషోత్తముడు తన చివరిరోజులు వారితోనే గడిపారు. ఈ రోజులలోనే తన పెద్ద అల్లుడు, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు, ఒక మనవడు మరణించారు. యీ చివరి దినాలలో కూడా రెవ.దాస్ అంతర్వేది గారితో కలసి దూర ప్రయాణములు చేసి సువార్త ప్రకటించారు. ఆయన చివరగా వ్రాసిన కీర్తనలు "సకలేంద్రియములారా! చాలా మీ పని తీరెన్" "పయనమై యున్నానయ్యా".

1890సం॥ ఆగష్టు 23వ తేదీ అర్ధరాత్రి పురుషోత్తముడు తన ఇహలోక ప్రయాణము ముగించి ప్రభువు సన్నిధికేగాడు.

1844సం॥లో పురుషోత్తముడు బరంపురములో పాస్టరు వుంటుండగా సాతాను గర్జించు సింహము వలె ఈ భక్తుని చీల్చుటకు కాచుకొని యుండెను. అంతట ఆయన తప్పుచేసినారు. తాను చేసిన తప్పిదము గూర్చి దివారాత్రములు తన మనస్సాక్షి చేయు నేరారోపణకు తట్టుకొనజాలక పశ్చాత్తాపముతో కృంగి కృశించి కటకపురి పోయి సేనానివేశన స్థలమున (కంటోన్మెంట్) పల్లపు ప్రాంత మహానది తీరమున ఏకాంతముగా దినములు గడుపుచుండెను. ఒకానొక దినమున మనస్తాపముతో మహానది తీరమున నున్న యొక సొరంగమున దినమెల్ల దుఃఖక్రాంతుడై "త్రాహిమాం క్రీస్తునాథా" యను పాప విలాప గీతమును గొప్ప ఆర్తితో వ్రాసుకొనెను. ఎవ్వరిని చూడక ఒంటరిగా దినదినము కుమిలి పోవుచుండగా ఆయనకు బాప్తిస్మ స్నానదీక్ష నిచ్చిన రెవ.చార్లెస్ లేసి దొరగారు అనుదినము పరామర్శించుచుండ, తన పాపము

క్షమింపబడనేరదను నిరాశను వ్యక్తపరచిరి. 'జేసువు పాపక్షమార్పణ దాతకాడేమో" అను అవిశ్వాసమే మహాపాపమని దొరగారు చెప్పినంతనే కవి తన విశ్వాసమును కూడగట్టుకొని "ఎందుకే చింతించెదవు" (హెబ్రీ 13:5) యను ఓదార్పు కీర్తన వ్రాసుకొనెను. వారే మరియొక సారి "పురుషోత్తమ సోదరా మీ పాపములు ఎక్కువైనవా? క్రీస్తుని స్లీవ రక్తపు చుక్క విలువ యెక్కువైనదియా? యని ప్రశ్నించగా చౌదరిగారి సందేహమంతయూ పటాపంచలై శుభప్రద నిరీక్షణతో "సందియము వీడవే" యను కీర్తన వ్రాసుకొనెను. శరీరేచ్ఛ, నేత్రాశ, జీవపుడంబమను శోధనల పరంపరలచే ఐహిక విషయముల వైపు ఈడ్వబడు తరుణములో ఆత్మ సంబోధనముగ "వద్దు మనసా - బుద్ధి కురచ" యను హెచ్చరిక గీతమును వ్రాసెను. పిమ్మట కటక్ మిషనెరీ మహాసభలో రెవ.సట్టన్ దొరగారు పురుషోత్తమునకు జీతము తగ్గించి శిక్ష విధించినారు. ఈయన చేసిన తప్పిదానికి పడ్డ శిక్ష పురుషోత్తముని సువార్త సేవను గొప్ప మలుపు తిప్పినది. కృంగిపోయిన పురుషోత్తముని విలియమ్ డాసన్ దొరగారు శ్రీకాకుళములో పనిచేయుటకు ఆహ్వానించినారు. పురుషోత్తముడు శ్రీకాకుళము చేరి స్థిమితపడి అచ్చట స్థిరపడ్డాక "యెహోవా నా మొరలాలించెను" అనే గొప్ప జనాదరణ పొందిన కీర్తన రచించినారు. విలియమ్ డాసన్ దొరవారితో శ్రీకాకుళంలో పనిచేయునట్టి ఉద్యోగ ఏర్పాటే తెలుగు ప్రజలకు / క్రైస్తవులకు వారి సేవా ఫలములు దక్కి ఆశీర్వాదకరమైనవి. ఏలననగా వారిరువురు చేసిన కీర్తనలు, వాటి ప్రచురణ ఆంధ్ర క్రైస్తవ లోకానికి చిరకాల కానుకలుగ మిగిలినవి. 1869 సం॥ కీర్తన పుస్తకము మూడవ ప్రచురణలో చౌధరి గారి కీర్తనలే 80 కలవు.

పురుషోత్తముని అన్నగారైన జగన్నాధుడు హైందవుడుగానే మరణించారు. ఇతని పెద్దకుమారుడు అప్పల నరసింహ, చిన్నకుమారుడు గోపినాధు, చిన్నాయన బాటలోనే ప్రభువును వెంబడించినారు. గోపినాధు కుమారుడు బాబు జాన్ చౌదరి "పురుషోత్తమ కవి జీవిత చరిత్ర" వ్రాసినారు. మీరు చదివిన ఈ సంగ్రహ జీవిత చరిత్రకు అదే ఆధారము.

# పులిపాక జగన్నాధము

క్రైస్తవ కవిత్రయం / వాగ్గేయకారులలో పులిపాక జగన్నాధముగారు ఒకరు. గోదావరి పరీవాహక ప్రాంతములో "శ్యామలాదేవి" లంకలో, సంపన్న వైష్ణవ బ్రాహ్మణ

కుటుంబములో, 1826సం॥ సెప్టెంబరు 14వ తేదీనాడు జగన్నాధముగారు జన్మించారు. వీరికి ఇద్దరు అన్నలు, అక్క, చెల్లెలు ఉన్నట్టు తెలుస్తుంది. జగన్నాధము గారు 14సం॥ల వయస్సు నాటికి ఆనాటి సాంప్రదాయ విద్యను పూర్తిచేసారు. ఆంగ్ల విద్యను అభ్యసిస్తే ఉన్నత పదవి దొరుకుతుందనే తలంపుతో వీరి తండ్రిగారు ఈయన్ని స్కూల్లో చేర్పించారు. ఆ స్కూల్ ప్రిన్సిపాల్ జాన్‌హే దొరగారు.

ఆంగ్ల విద్యనభ్యసించుటలో జగన్నాధము గారు తన ప్రజ్ఞను కనపర్చారు. కాని తను సనాతన బ్రాహ్మణ కుటుంబములో పుట్టాడు కనుక తన ఉపాధ్యాయులను, తోటి విద్యార్థులను తక్కువగా చూసేవాడు. బైబిల్ పాఠముల యెడల చాలా నిర్లక్ష్యం చూపేవాడు. హే దొరగారిచ్చిన బైబిల్‌ను తన పెట్టె అడుగున పడేసాడు. అయినప్పటికి ప్రిన్సిపాల్ హే గారు ఉపాధ్యాయులు జగన్నాధము గారి ప్రవర్తనను ఓపికతో భరించారు. ఈ విధముగా తన చదువు ఏడేళ్ళపాటు కొనసాగింది. 1847సం॥ తన చదువు పూర్తి కావస్తున్నపుడు ఓ రాత్రి జగన్నాధము గారికి నిద్రపట్టలేదు. స్కూల్లో తన ప్రవర్తన, ఉపాధ్యాయుల సహనము గురించి దీర్ఘంగా ఆలోచించగా తన మనస్సు కల్లోలమయింది. రెండు రోజులు స్కూలుకి వెళ్ళలేదు. జాన్‌హే గారిచ్చిన బైబిల్‌ని పెట్టె అడుగు నుండి తీసి, మరుసటి ఆదివారము సండేస్కూల్‌కి వెళ్ళాడు. తన సహజ ప్రవర్తనకు విరుద్ధంగా సండే స్కూలు పాఠము విన్నాడు. ప్రిన్సిపాల్ హే గారిని కలసి తన మనస్సులో నున్న విషయములు విప్పి చెప్పారు. యేసుప్రభువుని తన రక్షకునిగా అంగీకరిస్తున్నట్లు చెప్పారు. విషయము విన్న హే గారు చాలా సంతోషించారు.

ఈ సంగతి తెలియగానే జగన్నాధము గారి కుటుంబసభ్యులు, బంధువులు, ఊరిజనము వచ్చి పెద్ద గొడవ చేశారు. సిపాయిల రక్షణ మధ్య కలెక్టరు వారి ఫిర్యాదును విని, జగన్నాధము 18 సం॥లు నిండిన వాడని, మేజరు కావున తన యిష్టానుసారము మతము మార్చుకోవచ్చునని తీర్పు యిచ్చాడు. సిపాయిల రక్షణలో జగన్నాధాన్ని జాన్‌హే దొరగారికి అప్పజెప్పాడు.

1847సం॥ ఏప్రిల్ 29వ తేదీన హే దొరగారు అనేకమంది చూస్తుండగా జగన్నాధమునకు బాప్తీస్మమిచ్చాడు. అటు తరువాత తాను చదివిన స్కూల్‌లోనే టీచర్‌గా

పనిచేశాడు. 1851 సం॥మార్చి 6వ తేదీన జగన్నాథము ఎలైజా ఆస్‌బార్న్‌ని వివాహము చేసుకొన్నాడు. ఈమె వెలమ కన్వర్ట్. పోర్టర్ దొరసాని, గోర్డన్ దొరసాని వద్ద చదువు కున్నది. హే దొరసాని 1853లో స్థాపించిన బాలికల స్కూల్లో టీచర్‌గా పనిచేసింది. కలెక్టరు రీడ్ దొరగారు తన కచ్చేరీలో జగన్నాథానికి ఉద్యోగము ఇస్తాననగా, కాదని టీచరుగానే కొనసాగాడు. 1858 సం॥లో అభిషేకించబడి, శ్రీకాకుళమునకు పాస్టరుగా జగన్నాథముగారు పంపబడ్డారు. అచట ఎనిమిది సం॥లు పాస్టరుగా పనిచేసి, 1867 సం॥లో విశాఖపట్నంలోని ఆంగ్లో – వెర్నాక్యులర్ స్కూలుకు టీచరుగా ఈమె బదిలీపై వచ్చాడు తాను మరణించే వరకు అదే స్కూల్లో పనిచేశాడు. జగన్నాథము గారికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. వీరి గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. ఈయన దౌహిత్రి హిల్డా లాజరస్ చాలా ప్రముఖ డాక్టరు.

1898 సం॥ నవంబరు 4వ తేదీన జగన్నాథం గారు మరణించారు. క్రైస్తవుడయ్యాక జగన్నాథముగారు పాస్టరుగాను, టీచర్‌గాను పనిచేశారు. తన జీవితము సాఫీగా గడిచిపోయింది. ఈయన మృదుస్వభావి, స్నేహశీలి, హాస్య చతురుడు, ప్రార్థనాపరుడు, రోగుల కొరకు ప్రత్యేకముగా ప్రార్థన చేసెడివాడు. తెలుగు, హిబ్రూ, గ్రీకు, ఇంగ్లీషు భాషలు తెలిసినవాడు. బైబిల్ రివిజన్ కమిటీలో సభ్యుడు. జగన్నాథము గారు 41 కీర్తనలు రచించగా, 29 కీర్తనలు మటుకు ఆంధ్ర క్రైస్తవ కీర్తనల పుస్తకములో వున్నాయి. నీతిబోధిక (మాక్సిమ్స్ ఆఫ్ క్రిష్టియన్ మొరాలిటీ) అనే 162 పద్యాలు గల పద్య కావ్యాన్ని రచించాడు. ప్రస్తుతం ఇది అలభ్యము. ఆంగ్లభాషలో నున్న కొన్ని కరపత్రములను అనువదించాడు. ఈయన రచించిన కీర్తనలు చాలా సరళమైన భాషలో సందర్భానుసారముగా వుంటాయి. అనుభవపూర్వమైన కీర్తనలు ప్రతీ కీర్తన ఒక ఆణిముత్యము. పులిపాక జగన్నాథం గారి వంశీకులు ఎవరైనా వుంటే లేక వాయి విషయం తెలిసిన వారెవరైనా మమ్మల్ని సంప్రదించి ఏమైనా వివరాలిస్తే మా పత్రిక ద్వారా ప్రచురించగలం.